రెడ్‌క్రాస్‌లో సభ్యత్వం పొందాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఇండియన్ రెడ్‌క్రాస్‌లో శాశ్వత సభ్యత్వం పొందడం ఉపయోగకరమని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం భీమవరంలోని బివి రాజు కళాశాల సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో యలమంచిలి మండలం గ్రామ సచివాలయాలు, గ్రామ పంచాయతీలు సభ్యత్వం సొమ్మును మండల అభివృద్ధి అధికారి సిహెచ్ త్రిశూల ఫాణి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి 1,71,400 రూపాయల చెక్కును జిల్లా కలెక్టర్‌కు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఇంకా ఎక్కువ మంది రెడ్‌క్రాస్ సభ్యత్వం పొంది ఎక్కువ నిధులు అందించాలని కలెక్టరు కోరారు. రెడ్‌క్రాస్ సంస్థకు బ్లడ్ డోనేషన్లు పెరగాలన్నారు. బ్లడ్ నిల్వలు పెరిగినట్లు అయితే రక్తం అవసరం ఉన్న వారికి కొరత లేకుండా అందించ గలుగుతామన్నారు. అనంతరం రెడ్‌క్రాస్ సంస్థకు విరాళాలు అందజేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఒ రవికుమార్, డిపిఒ జివి మల్లికార్జునరావు, పాల్గొన్నారు.

కౌలు కార్డులపై శ్రద్ధేదీ..!

కౌలురైతుల పట్ల ప్రభుత్వం మరోసారి నిర్లక్ష్య ధోరణి కనబరుస్తోంది. రెండు జిల్లాల్లోనూ 2023-24కు సంబంధించి కౌలుకార్డుల (సిసిఆర్‌సి) జారీ ప్రక్రియ నేటికీ మొదలు కాని పరిస్థితి నెలకొంది. ప్రతియేటా కౌలురైతులకు అన్యాయం చేస్తూ భూయజమానులకు కొమ్ముకాస్తున్న పాలకులు ఈసారీ అదేబాటలో నడుస్తున్నట్లు కన్పిస్తోంది. అరకొరగా కౌలుకార్డులు జారీ చేసి మమ అన్పించేలా అధికారులు అడుగులు వేస్తున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే కౌలురైతులకు మరోసారి తీవ్ర అన్యాయం జరగనుందనడంలో ఎటువంటి సందేహమూ అక్కర్లేదు.

- రెండు జిల్లాల్లో దాదాపు మూడు లక్షల మంది కౌలురైతులు
- నేటికీ ప్రారంభం కాని సిసిఆర్‌సి జారీ ప్రక్రియ
- ఖరీఫ్ సాగుపై దాదాపు పూర్తయిన రైతుల మధ్య ఒప్పందాలు
- గతేడాది అరకొర కార్డుల జారీతో కౌలురైతులకు తీరని నష్టం
- భూయజమాని అంగీకారం నిబంధనతో దారుణ పరిస్థితి
- పంట నష్టం, బీమా, బ్యాంకు రుణం ఏఒక్కటీ అందని ద్రాక్షే

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

మే నెల సగం రోజులు గడిచిపోయినా కౌలురైతులకు అందించే పంట సాగుదారుని హక్కుపత్రాలు (సిసిఆర్‌సి) జారీ ప్రక్రియపై రెండు జిల్లాల అధికారుల్లోనూ చలనం లేకుండాపోయింది. ఇప్పటికే మూడొంతుల మంది రైతులు ఖరీఫ్ సాగుకు సంబంధించి పంట ఒప్పందాలు పూర్తి చేసుకున్న పరిస్థితి నెలకొంది. దీంతో ఈ ఏడాది సైతం కౌలురైతులకు తీవ్ర అన్యాయం చేసేందుకు ప్రభుత్వం పూనుకుందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో దాదాపు మూడు లక్షల మంది వరకూ కౌలురైతులు ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. రైతుభరోసా కేంద్రాలు, సచివాలయ వ్యవస్థ ద్వారా కౌలురైతులను గుర్తించి కౌలుకార్డులు జారీ చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం మాత్రం అవేమీ పట్టించుకోవడం లేదు. ప్రతియేటా గ్రామసభలు పెట్టి కౌలురైతులను గుర్తించి కార్డులు జారీచేసే విధంగా ప్రక్రియ ప్రారంభించేవారు. ఈ ఏడాది ఇప్పటి వరకూ ఆ ప్రక్రియ సైతం మొదలుకాలేదు. వైసిపి ప్రభుత్వం వచ్చాక కౌలురైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. 2011 భూఅధీకృత చట్టంలో భూయజమానితో సంబంధం లేకుండా వాస్తవ సాగుదారులైన కౌలురైతులకు సిసిఆర్‌సి కార్డులు జారీ చేయాలని నిబంధన ఉండేది. దీంతో రైతుసంఘాలు, రైతులు రెవెన్యూ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేసి తమ హక్కుగా ఉన్న కౌలుకార్డులు పొందేవారు. వైసిపి ప్రభుత్వం వచ్చాక 2011లోని కౌలురైతుల చట్టానికి మార్పులు చేసి 2019 పంటసాగుదారు హక్కు చట్టం తెచ్చింది. ఈ చట్టంలో భూయజమాని రాతపూర్వకంగా అంగీకరిస్తేనే కౌలురైతులకు కార్డులు జారీ చేయాలనే నిబంధన విధించింది. ఇది కౌలురైతులకు పెనుశాపంగా మారింది. 90 శాతం మంది భూయజమానులు కౌలురైతులకు కార్డులు జారీ చేసేందుకు ఒప్పుకోవడం లేదు. భూయజమానులకు అవగాహన కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమైన పరిస్థితి నెలకొంది. దీంతో ప్రతియేటా కౌలుకార్డులు జారీ ప్రక్రియ తూతూమంత్రంగా తయారైంది. ఏదో కొద్దిమందికి సిసిఆర్‌సి కార్డులు చేసి మమ అన్పిస్తున్నారు. దీంతో ధాన్యం విక్రయించడానికి కూడా కౌలురైతులకు వీల్లేకుండాపోయింది. దెబ్బతిన్న పంటలకు సంబంధించి నష్టపరిహారం, బీమా వంటివి సైతం కౌలురైతులకు అందడం లేదు. సాగు చేయని భూయజమాని ఖాతాల్లోకి వెళ్లిపోతున్నా ప్రభుత్వానికి పట్టడం లేదు.

మళ్లీ కౌలురైతులకు అన్యాయమేనా?

గతేడాది కౌలుకార్డుల జారీ ప్రక్రియ మమ అన్నట్లు సాగించి కౌలురైతులకు అన్యాయం చేశారు. ఏలూరు, పశ్చిమగోదావరి రెండు జిల్లాల్లో కలిపి దాదాపు లక్షా 30 వేలు వరకూ మాత్రమే సిసిఆర్‌సి కార్డులు జారీ చేసిన పరిస్థితి కన్పించింది. దీనిలో బ్యాంకు రుణాలు పొందిన రైతులు సగం మంది కూడా లేరు. ప్రభుత్వం అందించే రైతుభరోసా సాయం అందుకున్న కౌలురైతులను వేళ్ల మీద లెక్కపెట్టొచ్చు. ఈ ఏడాది కౌలురైతులకు అన్యాయం జరిగే పరిస్థితి కన్పిస్తోంది. గ్రామసభలు పెట్టి కౌలురైతులను గుర్తించి భూయజమాని అంగీకారంతో సంబంధం లేకుండా కౌలుకార్డులు జారీ చేసేందుకు ప్రభుత్వం ఏమాత్రం శ్రద్ధ పెట్టలేదని స్పష్టంగా కన్పిస్తోంది. ఇప్పటికైనా కౌలురైతులకు సిసిఆర్‌సి కార్డులు మంజూరును సచివాలయ వ్యవస్థ ద్వారా పెద్దఎత్తున చేపడితేనే వాస్తవ సాగుదారులకు న్యాయం జరుగుతోంది.

భూయజమాని అంగీకారంతో నిమిత్తం లేకుండా సిసిఆర్‌సి కార్డులు అందించాలి

కె.శ్రీనివాస్, ఎపి రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి

భూయజమాని అంగీకారంతో నిమిత్తం లేకుండా గ్రామస్థాయిలో విఆర్‌ఒ, సచివాలయ వ్యవస్థ ద్వారా నేరుగా కౌలురైతులను గుర్తించి సిసిఆర్‌సి కార్డులు జారీ చేయాలి. కౌలుకార్డు లేకపోవడం వల్ల రైతులకు పంట రుణాలు, పంట నష్టపరిహారం, బీమా ఏఒక్కటీ అందడం లేదు. దీంతో జిల్లాలో కౌలురైతుల ఆత్మహత్యల సంఖ్య ఆందోళనకరంగా మారుతోంది. కౌలుకార్డుల జారీ ప్రక్రియ సరిగ్గా అమలు చేయకపోతే రైతులతో కలిసి పెద్దఎత్తున ఆందోళన చేపడతాం.

వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు

మత్స్యకారులకు అండగా ప్రభుత్వం : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

వేట నిషేధ సమయంలో ప్రభుత్వం మత్స్యకారులకు అండగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బాపట్ల జిల్లా నిజాంపట్నంలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో పాల్గొని మత్స్యకార భరోసాను బటన్ నొక్కి ప్రారంభించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ప్రశాంతి, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాద రాజు సంయుక్తంగా మత్స్యకార భరోసా కార్యక్రమాన్ని వర్చువల్‌లో పాల్గొన్నారు. జిల్లాలో 1,635 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.1.63 కోట్లు ముఖ్యమంత్రి విడుదల చేశారని తెలిపారు. మొగల్తూరు మండలంలో 690 మంది, నరసాపురం మండలంలో 945 మంది లబ్ధిదారులు లబ్ధి పొందినట్లు తెలిపారు. ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకూ వెన్నుదన్నుగా నిలవాలనే లక్ష్యంతో వివిధ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా 19 కిలోమీటర్ల మేర తీరప్రాంతం కలిగి ఉందన్నారు. నరసాపురం, మొగల్తూరు మండలాల్లో విస్తరించి ఉన్న సముద్రతీర ప్రాంతంలో 3,500 వరకూ మత్స్యకార కుటుంబాలు ఉన్నాయన్నారు. వీరిలో 1,635 మంది లబ్ధిదారులకు మత్స్యకార భరోసాను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. 2022 -23లో 1,407 మంది లబ్ధిదారులకు రూ.1.40 కోట్ల మత్స్యకార భరోసా కింద ఆర్థిక సాయం అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ జెడి ఆర్‌జివిఎస్ ప్రసాద్, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షులు అంద్రాజు చల్లారావు, వైస్ ప్రెసిడెంట్ నాగిడి భానుమూర్తి, నరసాపురం మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, జెడ్‌పిటిసి తిరుమాణి బాపూజీ, లక్ష్మణేశ్వరం సర్పంచి తిరుమాని వెంకట రాజు, బియ్యపుతిప్ప సొసైటీ అధ్యక్షులు సంఘాని త్రిమూర్తులు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను సాధించాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

విద్యార్థులకు విజయం ఇచ్చిన బలం సడలనివ్వకుండా క్రమ శిక్షణతో అనుకున్న లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. ఇటీవల పది పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ క్రమశిక్షణ హార్డ్ వర్క్ లేకపోతే ఏమీ సాధించ లేమన్నారు. 25 సంవత్సరాలు కష్టపడి చదివితే భవిష్యత్తు బంగారు బాటవుతుందన్నారు. జెసి ఎస్.రామ్ సుందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఏ దారిలో ప్రయాణిస్తున్నారో భవిష్యత్తులో కూడా అదే దారిలో పయనించాలన్నారు. నరసాపురం సబ్ కలెక్టరు ఎం.సూర్యతేజ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివి మంచి ఫలితాలు తీసుకురావడం అభినందనీయమన్నారు. అందుకు సహకరించిన ఉపాధ్యాయులకు, ప్రోత్సహించిన తల్లిదండ్రులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, ఆర్‌డిఒ దాసిరాజు, డిఇఒ ఆర్.వెంకటరమణ, విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా అరికట్టేందుకు స్పెషల్ టీమ్‌లు

ఏలూరు రేంజ్ డిఐజి జివిజి.అశోక్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ డిఐజి జివిజి అశోక్‌కుమార్

గంజాయి అక్రమ రవాణాపై స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేశామని ఏలూరు రేంజ్ డిఐజి జివిజి.అశోక్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్లో ఆయన మీడియాతో మాట్లాడారు. గంజాయి అక్రమ రవాణాను అరికట్టేందుకు నాలుగేళ్ల కిందట ముద్దాయిల వివరాలను కూడా సేకరిస్తున్నామని తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లాలో పోక్సో కేసులు ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామని, దిశ స్టేషన్లో కూడా 12 కేసులు ఉన్నాయని తెలిపారు. రాబోయే ఆరు నెలల్లో ఈ పన్నెండు కేసుల్లో సీరియస్ కేసుల్లోని ముద్దాయిలకు త్వరితగతిన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా మండల స్థాయి అధికారులతో, అక్కడున్న యువతతో పీస్ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. ఇటీవల ఏలూరు రేంజ్‌కు బదిలీపై వచ్చిన డిఐజి అశోక్ కుమార్ తొలిసారిగా భీమవరంలో డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలతో సమీక్షా సమావేశం నిర్వహించి క్రైమ్ రేట్ తగ్గేందుకు చర్యలు తీసుకోవాలని ఆదే శించారు. డిఐజి వెంట జిల్లా ఎస్‌పి యు.రవిప్రకాష్, డిఎస్‌పి బి.శ్రీనాథ్, సిఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

చించినాడలో చెక్‌పోస్టు ఏర్పాటు చేయాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ సుందర్ రామిరెడ్డి

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలో చించినాడ చెక్ పోస్టు ఏర్పాటుకు స్థల పరిశీలన చేసి త్వరితగతిన చెక్ పోస్టు ఏర్పాటు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్ సుందర్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం చించినాడలో పర్యటించిన సందర్భంగా సుందర రామిరెడ్డి మాట్లాడారు. తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు చించినాడ సరిహద్దు ప్రాంతం కాబట్టి ఇక్కడ చెక్ పోస్టు వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు ఇతర జిల్లాల నుంచి ఎటువంటి అక్రమ రవాణా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ, పోలీసు, కోఆపరేటివ్ మార్కెటింగ్ మూడు శాఖలు అధికారులు సిబ్బంది కలిసి మూడు షిఫ్టుల్లో 24 గంటలు చెక్ పోస్టు పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. చెక్ పోస్టు నిర్వహణకు కంప్యూటర్స్, రిజిస్టర్లు, హాజరు పట్టి తదితర మౌలిక సదుపాయాలు కల్పించి, సమర్థవంతంగా పని చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అక్రమ రవాణా నిరోధించేందుకు అధికారులు, సిబ్బంది కలిసికట్టుగా పనిచేసి మంచి ఫలితాలు తీసుకురావాలన్నారు. ఆయన వెంట సబ్ కలెక్టరు ఎం.సూర్యతేజ, తహశీల్దార్ లక్కు. నరసింహారావు పాల్గొన్నారు.

భూములిచ్చిన రైతులకు న్యాయం చేయాలి

రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

బాధితులకు అండగా కదిలి రావాలి : సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

అభివాదం చేస్తున్న రాజకీయ, ప్రజాసంఘాల నేతలు, బాధితులు

ప్రజాశక్తి - పాలకోడేరు

పాలకోడేరు కోటిగట్టు జగనన్న లేఅవుట్‌కు భూములిచ్చిన రైతులకు నష్ట పరిహారం అందించాలని, లేక భూమిని తిరిగిచ్చి రైతులకు న్యాయం చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. బాధితులకు న్యాయం చేయకపోతే రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, ప్రజలు బాధితులతో కలిసి ఉద్యమానికి నాంది పలుకుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించింది. అప్పటికీ సమస్య పరిష్కరించకపోతే బాధితుల పక్షాన నిలబడి ప్రభుత్వం తీసుకున్న భూమిలో పేద రైతుల చేత సాగు చేయిస్తామని రౌండ్ టేబుల్ సమావేశం స్పష్టం చేసింది. పాల కోడేరు కోటిగట్టు జగనన్న ఇళ్ల స్థలాల బాధితుల లేఔట్‌లో సిపిఎం, టిడిపి, జనసేన, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి బాధితులు సాయిబాబు అధ్యక్షత వహించి సమస్యలు వివరించారు. 2019లో ప్రభుత్వ అధికారులు రెట్టింపు డబ్బులు ఇస్తామని కుటుంబాల నుంచి భూములు తీసుకోవడం జరిగిందన్నారు. తర్వాత సంతకాలు తీసుకుని అసైన్డ్ భూమికి డబ్బులు రావని చెప్పారని తెలిపారు. అంతా నిరుపేద కుటుంబాలకు చెందిన వారని, న్యాయం చేయాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం మాట్లాడుతూ మూడు కుటుంబాలకు అండగా మానవత్వంతో అంతా కలిసి రావడం అభినందనీయమన్నారు. మండల ప్రజలంతా బాధ్యతతో కుటుంబాలకు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. పేద రైతుల వద్ద ఉన్న అరకొర భూములు ఎవరూ అమ్ముకోరని, ఒకవేళ కొన్నా రెక్కలు కష్టంతోటే కొనుక్కుంటారని చెప్పారు. ప్రభుత్వ ఇళ్ల స్థలాల పేరుతో భూములు తీసుకుని నష్టపరిహారం చెల్లించకపోవడం దుర్మార్గమన్నారు. జిల్లాలో ఇళ్ల స్థలాల కేటాయింపులో ఎన్నో అవకతవకలు జరిగాయన్నారు. కాళ్ల, భీమవరం రూరల్, నరసాపురం, మొగల్తూరు, ద్వారకాతిరుమల, పెదపాడు ప్రాంతాల్లో బడా భూస్వాముల చేతుల్లో ప్రభుత్వ భూములు ఉన్నాయని విమర్శించారు. వారి దగ్గర నుంచి భూములు తీసుకునే దమ్ము ధైర్యం ప్రభుత్వానికి ఉందని ప్రశ్నించారు. కుల మతాలకు రాజకీయ పార్టీలకు సంఘాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ మానవత్వంతో కదిలొచ్చి బాధితులకు అండగా నిలవాలన్నారు. న్యాయం జరిగే వరకూ సిపిఎం బాధితులకు అండగా ఉంటుందని తెలిపారు. టిడిపి మండల అధ్యక్షులు దెందుకూరు ఠాగూర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ బాధితులు సమస్యను ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లారని ఆర్‌డిఒ, తహశీల్దార్‌తో ఎంఎల్ఎ రామరాజు మాట్లాడారని తెలిపారు. నిరుపేద రైతుల భూములు తీసుకుని నష్టపహారం చెల్లించకపోవడం ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుందనడానికి నిదర్శమని విమర్శించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం ఎంతో మంది నిరుపేదలకు అండగా నిలబడి వారి సమస్యలు పరిష్కారానికి ఎంతో కషి చేశారని చెప్పారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జెఎన్‌వి గోపాలన్ మాట్లాడుతూ పేద రైతులకు నష్టపరిహారం వస్తుందో లేదో అధికారులకు తెలుసని, అయితే ప్రభుత్వం అన్యాయం చేసి రైతులను మోసగించిందని విమర్శించారు. బాధితులకు న్యాయం చేయడానికి అంతా కలిసి నష్టపరిహార సాధన కమిటీ ఏర్పాటు చేసుకోవాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శేషాపు అప్పియ్య మాట్లాడుతూ రైతులను ప్రభుత్వం మోసగించడం అన్యాయమేని, న్యాయం జరిగే వరకూ వ్యవసాయ కార్మిక సంఘం పూర్తి మద్దతు తెలుపుతుందని చెప్పారు. టిడిపి యువత విభాగం నాయకులు, రెడ్డి శ్రీను, టిడిపి సీనియర్ నాయకులు గుల్లేపల్లి సత్యనారాయణ మాట్లాడారు. ఈ సమావేశంలో రైతు సంఘం నాయకులు కలిదిండి గోపాల్‌రాజు, సిఐటియు మండల కార్యదర్శి వైఎస్ఎన్ మూర్తి, టిడిపి నాయకులు గాదిరాజు రాంబాబు, గుత్తుల సత్యనారాయణ, మాధవ, జనసేన నాయకులు శ్రీరామ శ్రీను, గ్రామస్తులు వెంకటేశ్వరరావు, కిరణ్, రామకృష్ణ, ఆకుల దుర్గారావు, సత్యనారాయణ, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆక్వా యూనివర్శిటీ పనులు వేగవంతం

రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ప్రసాదరాజు

ఆక్వా యూనివర్శిటీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మంగళవారం లిఖితపూడిలో నిర్మిస్తున్న ఆక్వా యూనివర్శిటీ పనులను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులు నిర్వహించాలన్న ధ్యేయంతో నిర్మాణ పనులు వేగవంతం చేసినట్లు తెలిపారు. డిసెంబరులో ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి చేతులమీద యూనివర్సిటీ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. భారతదేశంలోనే 3వ ఆక్వా యూనివర్సిటీని నరసాపురం నియోజకవర్గంలో 335 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించుకోవడానికి నా కృషి నేటికి ఫలించిందన్నారు. ఈ యూనివర్సిటీ వల్ల ఆక్వా రైతులకు ఎంతో మేలు జగుతుందన్నారు. అక్టోబరులో అడ్మినిస్ట్రేషన్ బ్లాక్ నిర్మాణం పూర్తి చేసి తరగతులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆక్వా యూనివర్సిటీ ఒఎస్‌డి ఒ.సుధాకర్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్‌పిటిసిలు బొక్క రాధాకృష్ణ, తిరుమాని బాపూజీ, ఆత్మ కమిటీ ఛైర్మన్ కడలి రాంబాబు, సర్పంచి పోతురాజు పాల్గొన్నారు.

ఉపాధి హామీ అమల్లో కేంద్రం విఫలం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు

ఉపాధి హామీ చట్టం అమల్లో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు అన్నారు. మంగళవారం ఉపాధి హామీ పర్యటనలో భాగంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజుతో కలిసి వెంకట్రామన్నగూడెంలో ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ కూలీలకు 272 రూపాయల కూలి ఎక్కడా అమలు జరగడంలేదన్నారు. కష్టం ఎక్కువ ఫలితం తక్కువగా ఉందన్నారు. ఉపాధి కూలీలు మాట్లాడుతూ తమకు నాలుగు వారాల నుండి పని చెబుతున్నారని, రోజుకు రూ.272 వేతనం రావడం లేదని తెలిపారు. కాలువలో చెత్త తీయడానికి మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. వ్యవసాయంలో యంత్రాలు రావడంతో ఉపాధి పనులు తప్ప వేరే పనులేవీ లేవని, ఈ పనులు కూడా ఎన్ని రోజులు ఉంటాయో తెలీదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై చింతకాయల బాబూరావు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. కూలీలంతా ఐక్యతతో బిజెపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. కూలీలకు అండగా రైతు సంఘం కూడా ఉంటుందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ ఉపాధి కూలీల సమస్యలపై నిరంతరం పోరాడేది వ్యవసాయ కార్మిక సంఘమేనని, ఆ సంఘంలో అందరూ సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జి.సత్యనారాయణ, ఎ. నాగేశ్వరరావు, నూనె నాగేశ్వరరావు, ఎం.పెద్దిరాజు, మానుకొండ రత్తమ్మ, సూర్యకుమారి, గంటా బేబీ, మానకొండ విమల పాల్గొన్నారు.

అత్తిలి : సైట్ సూపర్‌వైజర్లకు స్మార్ట్ ఫోను ఇచ్చి రీఛార్జ్‌కు బిల్లులు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దంతుపల్లిలో పనిచేస్తున్న ఉపాధి కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, పనిముట్లు, సమ్మర్ అలవెన్స్, ప్లే స్లిప్పులు, తాగునీరు, మజ్జిగ ఇవ్వడం లేదని కూలీలు నేతల వద్ద వాపోయారు. అనంతరం వీరభద్రరావు, గోపాలన్ మాట్లాడుతూ ఒకవైపు ఎండ, మరోవైపు ఉక్కపోత ఉన్నా ప్రభుత్వం పని ప్రదేశంలో తాగునీరు, మజ్జిగ కల్పించకపోవడం దారుణమన్నారు. పని ప్రదేశంలో సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రెండు పూటలా పని విధానం, ఫొటో సిస్టంను తక్షణం రద్దు చేసి పని ప్రదేశంలో కూలీలకు అన్ని సౌకర్యాలూ కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కడలి సత్యవతి, కుడిపూడి కన్యాకుమారి, పాత గొలుసు రేవతి, కడలి రామలక్ష్మి, కవరు సుజాత, బెల్లపు ఉమా, కడలి గోవిందు పాల్గొన్నారు.

క్షత్రియులకు అన్నివిధాలా సేవలందిస్తా

రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు

ప్రజాశక్తి - కాళ్ల



ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని సత్కరిస్తున్న పాతపాటి శ్రీనివాసరాజు

సిఎం జగన్ నమ్మకాన్ని వమ్ము చేయనని, క్షత్రియులకు అన్ని విధాలా సేవలందిస్తానని రాష్ట్ర క్షత్రియ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సిఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజుతో కలిసి పుష్పగుచ్ఛం అందించామని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డితో తాను పనిచేసే అవకాశం రావడం ఆనందంగా ఉందన్నారు. క్షత్రియ సామాజిక వర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందేలా కృషి చేస్తున్నాని తెలిపారు. తన తండ్రి సర్రాజు అడుగు జాడల్లో, సిఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తానని తెలిపారు.

వీరవాసరం సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డిఎల్‌డిఒ కిషోర్‌కుమార్

అలసత్వంగా ఉంటే సహించను : డిఎల్‌డిఒ

ప్రజాశక్తి - వీరవాసరం

సచివాలయ ఉద్యోగులు విధి నిర్వహణలో అలసత్వంగా ఉంటే సహించేదిలేదని డిఎల్‌డిఒ కె.కిషోర్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని పలు సచివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా యూనిఫారం వేసుకుని విధులు నిర్వర్తించాలన్నారు. పలువురు ఉద్యోగుల హాజరు పట్టీని పరిశీలించారు. సంక్షేమ పథకాలు అమలు తీరు, కళ్యాణమస్తు, సుస్థిర అభివృద్ధిలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భినులకు అందుతున్న సదుపాయాలు, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భవతీ నమోదు వంటి అంశాలను సచివాయ ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎఒ శామ్యూల్ ఉన్నారు.

పెండింగ్ క్లెయిమ్‌లను పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఆచంట

భవన నిర్మాణ కార్మిక సంఘం సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించి, పెండింగ్‌లో ఉన్న 32 వేల క్లెయిమ్‌లను తక్షణం పరిష్కరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు దాసిరెడ్డి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను తక్షణం పరిష్కరించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సంక్షేమ బోర్డు నుంచి నిధులను వాడుకోవడం సరికాదన్నారు. తక్షణం రాష్ట్ర ప్రభుత్వం కల్పించుకుని సంక్షేమ బోర్డులో పెండింగ్లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో కార్మికులతో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కేతా నాగాంజనేయులు, సిఐటియు మండల కార్యదర్శి వద్దిపర్తి అంజిబాబు, సత్యనారాయణ, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వేసవి శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - పాలకొల్లు

వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బివిఆర్ఎం గర్ల్స్ హైస్కూల్లో 15 రోజుల పాటు వేసవి శిక్షణా తరగతులు మంగవారంతో ముగిశాయి. వేదాంతం సుందరి, సురేఖ, పిఎల్ ప్రసాద్, ఉద్దరాజు పెద్దిరాజు విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీషులో శిక్షణ ఇచ్చారు. 100 మంది విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకున్నారు. ముగింపు సభకు ముఖ్య అతిథిగా మాజీ ఎంఎల్ఎ బాబ్జీ హాజరయ్యారు. స్పోకెన్ ఇంగ్లీషులో రాణించిన జాహ్నవి, ఇతర విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వసుధ ఫౌండేషన్ కన్వీనర్ పి.బుద్ధరాజు, హెచ్ఎం వై.ప్రభాకర శాస్త్రి, బ్రహ్మాజీ పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

విజేతగా నిలిచిన విజయవాడ జట్టు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

గెలుపు ఓటములు సహజమని, క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని పలువురు వక్తలు తెలిపారు. నెల రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి నాయీ బ్రాహ్మణ క్రికెట్ టోర్నమెంట్ మంగళవారంతో ముగిసింది. రాష్ట్ర నలుమూలల నుంచి 14 జట్లు పాల్గొనగా 40 మ్యాచ్‌లు నిర్వహించారు. విన్నర్స్‌గా విజయవాడ ఎస్ డిఎంఎస్ జట్టు, రన్నర్స్‌గా విజయవాడ జట్టు నిలిచాయి. గెలుపొందిన వారికి రూ.30 వేలు, షీల్డ్, రన్నర్స్‌కు రూ.20 వేలు, షీల్డ్ అందజేశారు. క్రీడలు మానసికోల్లాసాన్ని అందిస్తాయన్నారు. నాయి బ్రాహ్మణులు మొట్టమొదటి సారిగా రాష్ట్రస్థాయిలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి చెన్నమల్ల చంద్రశేఖర్, వైసిపి నాయకులు, బిసి సంఘం అధ్యక్షులు కోడే యుగంధర్, బండి రమేష్‌కుమార్, బన్ను ప్రసాద్, టోర్నమెంట్ నిర్వాహకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాస్

వేసవి విజ్ఞాన శిబిరాన్ని వినియోగించుకోండి

జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

ప్రజాశక్తి - పాలకోడేరు

శాస్త్ర విజ్ఞాన ప్రచారంలో భాగంగా బడి పిల్లలకు సెలవుల్లో విజ్ఞానం, వినోదంతో కూడిన వేసవి వినోదం రూపొందించి జిల్లాలో వివిధ కేంద్రాలతో నిర్వహిస్తున్నామని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లుల శ్రీనివాస్ అన్నారు. పాలకోడేరు శాఖా గ్రంథాలయంలో వేసవి వినోద కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ వారం రోజుల పాటు నిర్వహించే ఈ శిబిరంలో ఆటలు, పాటలు, కథలు, డ్రాయింగ్, సైన్సు ప్రయోగాలు, మ్యాజిక్ వంటివి విద్యార్థులకు నేర్పించనున్నట్లు తెలిపారు. యుటిఎఫ్ నాయకులు వి.భారతి మాట్లాడుతూ విద్యార్థులు మంచి అలవాట్లు నేర్చుకోవాలన్నారు. జెవివి సోషల్ మీడియా కన్వీనర్ పి.ఫణిరాజేష్ మాట్లాడుతూ వేసవిలో బయట ఎండలో తిరగకుండా గ్రంథాలయానికి వచ్చి కొత్త కొత్త విషయాలు నేర్చుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు తెన్నేటి మాస్టార, గ్రంథాలయ పాలకుడు కుమార్, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆకివీడు : విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని పలువురు వక్తలు సూచించారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో మంగళవారం రాత్రి వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రంథాలయ లీడర్స్ ఫోరం మాజీ అధ్యక్షులు, ప్రముఖ ఇంజినీర్ దాసరి సత్యనారాయణ అధ్యక్షత వహించి మాట్లాడారు. కార్యక్రమం ప్రముఖ న్యాయవాది నెల్లి సతీష్ కుమార్ సౌజన్యంతో నిర్వహించారు. మాతృ దినోత్సవం, మాతృ (తెలుగు) భాష, అంశాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. మాతృమూర్తి గొప్పదనం అనే అంశంపై జరిగిన పోటీలో ప్రథమ బహుమతి తహసిన్, ద్వితీయ బహుమతి నాగచైతన్య, తృతీయ బహుమతి రేవంత్ గెలుపొందారు. ఘనమైన భాష మన తెలుగు భాష అంశంపై జరిగిన పోటీలో ప్రథమ బహుమతి ఎన్.సిరి, ద్వితీయ బహుమతి షణ్ముఖ, తృతీయ బహుమతి రిషిత అందుకున్నారు. ఈ కార్యక్రమంలో గాయకుడు, ఉపాధ్యాయుడు, మహేష్ విద్యార్థులకు సంగీతం అవసరాన్ని విలువను, పలు సాధారణ విషయాలను వివరించారు. ఈ శిబిరం నెలరోజుల పాటు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్ నెల్లి మహేశ్వరి, కుమారి మోహన, గ్రంథ పాలకురాలు కె.పార్వతి పాల్గొన్నారు.

భగ్గేశ్వరంలో 'గడపగడపకూ..'

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని భగ్గేశ్వరం గ్రామంలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఎంఎల్‌సి, జిల్లా పరిషత్ ఛైర్మన్ కవురు శ్రీనివాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గుణ్ణం నాగబాబు, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, గ్రామ పార్టీ అధ్యక్షులు మహేష్, సర్పంచుల ఛాంబర్ అధ్యక్షులు గుమ్మపు పెద్దిరాజు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

నిప్పుల కొలిమి..

వేడి గాలులతో జనం విలవిల
రోడ్లన్నీ నిర్మానుష్యం

ప్రజాశక్తి - పాలకొల్లు

భానుడు భగభగ మండిపోతున్నాడు.. ఎండల తీవ్రతకు జనం విలవిల్లాడిపోతున్నారు. వేడిగాలులకు జనం బయటకు రావాలంటేనే బెంబేలెత్తిపోతున్నారు. పట్టణంలోని రోడ్లు ఎండ తీవ్రతకు కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. మంగళవారం 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు దాటడంతో జనం మలమలా మాడిపోతున్నారు. మధ్యాహ్నం దాదాపు ఆదివారం వలె షాపులన్నీ మూసేశారు. రోడ్లపై ప్రజలు లేకపోవడంతో నరసాపురం, భీమవరం, పెనుగొండ, దొడ్డిపట్ల రోడ్లు నిర్మానుషంగా ఉన్నాయి. మహిళలు, వృద్ధులు, చిన్నారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

నిర్మానుష్యంగా ఉన్న పాలకొల్లు - భీమవరం రోడ్డు

ఆకివీడు : భానుడు ప్రతాపం చూపుతున్నాడు. చరిత్రలో ఎన్నడూ కనీవినీ ఎరుగని రీతిలో ఉష్ణోగ్రతలు 47 డిగ్రీలకు చేరాయి. అక్రమార్జితులు, ఆక్రమణదారులు ఇదే మంచి సమయం అనుకుని కొల్లేరులోని జమ్ముకు నిప్పు పెడుతున్నారు. దీంతో భారీ స్థాయిలో మంటలు ఎగిసిపడి పరిసర ప్రాంతాలు మసిబారిపోతున్నాయి. అయినా ఆక్రమణదారులు మంటలు ఆరాక స్థలాన్ని ఆక్రమించి చేపల చెరువులను తవ్వేస్తున్నారు. కొల్లేరులో చెరువులు తవ్వద్దంటూ అధికారులు మొత్తుకుంటున్నా పట్టడం లేదు. మంటల వేడికి పరిసర ప్రాంతాల ప్రజలు విలవిల్లాడిపోతున్నారు. ఒక పక్క ఎండ వేడిమి మరో పక్క మంటల తాకిడికి ఇళ్లల్లో ఉండలేకపోతున్నారు. ఎండ వేడిమితో చిన్నారులు, వృద్ధులు అల్లాడిపోతున్నారు. జనం డీహైడ్రేషన్‌కు గురై విరోచనాలు, జ్వరాలు, వాంతుల బారిన పడుతున్నారు. దీంతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి.

సొంత భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్‌వాడీ కేంద్రాల రూపురేఖలు మార్చి, పౌష్టికాహారాన్ని అందించే దిశగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. రాయలంలో రూ.14.40 లక్షలతో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు బలమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని పేర్కొన్నారు. అంతేకాకుండా అంగన్వాడీ కేంద్రాలను ప్రభుత్వ సొంత భవనాల్లో ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో భాగంగానే రాయలం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నిర్మించామని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్

సీసీ రోడ్లు ప్రారంభం

రాయలంలో రూ.41 లక్షలతో నిర్మించిన ఇంటర్నల్ సీసీ రోడ్లను ఎంఎల్ఎ గ్రంధి శీనివాస్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 41 లక్షల రూపాయలతో మానుకొండ సూరయ్య ఇంటి నుంచి ఉన్నమట్ల పాండు ఇంటి వరకూ, జల్లి రామచక్రం ఇంటి నుండి చాబత్తుల శామ్యూల్ ఇంటి వరకూ, డి.గోపాల్‌రావు ఇంటి నుండి కొక్కిరిగడ్డ సంజీవరావు ఇంటి వరకూ సీసీ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన వైసిపి నాయకులు చినమిల్లి శ్రీనివాస్, చిన మిల్లి నాగన్న, చినమిల్లి వెంకటరాయుడు, చెల్లబోయిన బుజ్జి పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షన్‌పై అవగాహన కల్పించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

స్వచ్ఛ సర్వేక్షన్‌పై ప్రజలకు అవగాహన కల్పించి వారిని భాగస్వాములను చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. మంగళవారం బివి రాజు కళాశాల సమావేశ మందిరంలో స్వచ్ఛ సర్వేక్షన్ 2023పై మండల స్థాయి అధికారులకు ఒక రోజు వర్క్ షాప్ నిర్వహించారు. వర్క్‌షాప్‌లో కెప్టెన్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్‌పై మండల స్థాయి అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, దీని గురించి పూర్తిగా ప్రజలకు వివరించి వారిని భాగస్వాములను చేయాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షన్ చేసేటప్పుడు టీమ్ వర్క్ ఉండాలన్నారు. విజువల్ శానిటేషన్ చేయాలని అధికారులందరూ పాల్గొని మంచి లీడర్షిప్ ఇచ్చి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. రోడ్లపై, డ్రెయినేజీలో చెత్త లేకుండా చూడాలన్నారు. జిల్లాలో శానిటేషన్ చేపట్టే గ్రామాలను మూడు రకాలుగా విభజించడం జరిగిందని, శానిటేషన్ బ్లాకు బాగున్న గ్రామాలను గ్రీన్ గా, మధ్యస్థంగా ఉన్న గ్రామాలను ఎల్లో గా, శానిటేషన్ బాగాలేని గ్రామాలను రెడ్‌గాను గుర్తించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఇఒ రవికుమార్, డిపిఒ జివి.మల్లికార్జునరావు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి రామస్వామి, డ్వామా పీడీ ఎస్‌టివి రాజేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్‌ఎస్ వేణుగోపాల్, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి - అత్తిలి

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కేతా గోపాలన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలో పలు గ్రామాల్లో ఆయన పర్యటించి రైతులతో మాట్లాడారు. పెనుగొండ మండలంలో 41 కేజీలు తూకం వేసి రైతుకు మేలు చేస్తున్నారని అన్నారు. సంచుల కొరత లేకుండా చూడాలన్నారు. కొన్ని ప్రాంతాల్లో 41 కేజీలు తూస్తుంటే కొన్నిసార్లు 42, 43 కేజీల ధాన్యం తూస్తున్నారని రైతులు తమ వద్ద ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బి.వీరభద్రం, రైతులు పాల్గొన్నారు.

భీమవరం : ధాన్యం కొనుగోళ్లలో నూకశాతం కింద రైతులు ఎంత ధాన్యం ఇవ్వాలో జిల్లా అధికారులు సరైన విధివిధానాలు ఇవ్వకపోవడంతో మిల్లర్లు, బ్రోకర్లు రైతులను అయినకాడికి దోచుకుంటున్నారని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో విమర్శించారు. నూకశాతం పేరుతో మిల్లర్లు రైతులను దోచుకుంటుంటే అరికట్టాల్సిన అధికారులు వారి డిమాండ్‌కు తలొగ్గి ఏ రకం ధాన్యం అయినా నూకశాతం కింద బస్తాకు కేజీ ఇవ్వాలని నిర్ణయించడం దారుణమని తెలిపారు. మిల్లర్ల దోపిడీకి ప్రభుత్వ నిర్ణయానికి తేడా లేదని విమర్శించారు. ఈ నిర్ణయంలో కూడా అధికారుల సమన్వయం లేదని జిల్లా పౌరసరఫరాల అధికారులు ఏరకం ధాన్యం అయినా కేజీ అదనంగా ఇవ్వాలని చెబుతుంటే ఆర్‌డిఒలు, మండల వ్యవసాయ అధికారులు 1153, 1156 రకం ధాన్యం అయితే సంచితో కాకుండా రెండు కేజీలు అదనంగా ఇవ్వాలని చెబుతున్నారని తెలిపారు. దీన్ని ఆసరగా తీసుకుని మిల్లర్లు అదనంగా 2 కేజీల నుండి 5 కేజీల వరకూ దోచుకుని రైతులను ముంచుతున్నారని తెలిపారు. తక్షణం కలెక్టర్ జోక్యం చేసుకుని ఈ దోపిడీని అరికట్టాలన్నారు.

సెలవుల్లో ఉపాధ్యాయులతో పని చేయించొద్దు

డిఇఒకు ఫ్యాప్టో వినతి

ప్రజాశక్తి - భీమవరం

వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులతో వివిధ రకాల పనులను చేయించుకోవడం దారుణమని, దీనిని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ బిహెచ్.జవహర్‌లాల్ రాజ్ అన్నారు. వివిధసమస్యలపై జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్‌వి.రమణకు ఫ్యాప్టో ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జవహర్‌లాల్ రాజు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులతో పని చేయించుకోవడం దారుణమన్నారు. ఈ విధానాన్ని ఫ్యాప్టో పూర్తిగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. ఒక వేళ వేసవి సెలవు దినాల్లో ఉపాధ్యాయులను పనిచేయించాలనేది ప్రభుత్వ నిర్ణయమైతే విద్యాశాఖను కూడా నాన్ వెకేషన్ డిపార్ట్‌మెంట్‌గా పరిగణిస్తూ మిగతా డిపార్ట్‌మెంట్ల వలే ఎరండ్ లీవ్ మంజూరు చేయాలని కోరారు. డిఇఒకు వినతిపత్రం అందించిన వారిలో ఫ్యాప్టో జిల్లా జనరల్ సెక్రటరీ బికె.దామోదర్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామభద్రం, యుటిఎఫ్ జిల్లా కోశాధికారి సిహెచ్.పట్టాభి రామయ్య, ఎపిటిఎఫ్ నాయకులు జి.ప్రకాష్, డిటిఎఫ్ నాయకులు ఎం.శ్రీనివాసరావు, ఆర్.కేశవరావు, యుటిఎఫ్ నాయకులు కె.రాజశేఖర్, టిజె.జైకుమార్ ఉన్నారు.

డిఇఒకు వినతిపత్రం అందిస్తున్న ఫ్యాప్టో నాయకులు

బార్ అసోసియేషన్ ఎన్నికలకు 36 నామినేషన్లు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ఈ నెల 26వ తేదీన జరిగే నరసాపురం న్యాయవాదుల సంఘ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ పత్రాల దాఖలు మంగళవారంతో ముగిశాయి. మొత్తం 15 స్థానాలకు 36 మంది అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేశారని ఎన్నికల అధికారి పూరిళ్ల శ్రీనివాస్, సభ్యులు ఉల్లంపర్తి సత్యనారాయణ, కొల్లాటి ఆదినారాయణ తెలిపారు. అధ్యక్ష పదవికి కామన బాల సత్యనారాయణ, చల్లా దానయ్య నాయుడు, ఎస్ఆర్ఆర్.మోహన్ బాలాజీ, తానుకొండ సంతోష్‌కుమారి నామినేషన్లు దాఖలు చేశారన్నారు. ఉపాధ్యక్ష పదవికి చదలవాడ జ్ఞానప్రకాష్, గోపిరెడ్డి మణి, నక్కా కుమార్ రత్నం, ప్రధాన కార్యదర్శి పదవికి యర్రంశెట్టి దేవేందర్ ఫణికర్, ఆర్‌జి.కుమార్, విన్నా సూర్యప్రకాష్‌రావు, రంపా పుల్లాజీ, జాయింట్ సెక్రటరీ పదవికి కురెళ్ల సోమశేఖర్, గోడి సత్యనారాయణ, సోడదాసి శ్రీధర్, కోశాధికారి పదవికి దొంగ సుభాష్ బాబు, బళ్ల శ్రీహరి, ఆర్‌జి.కుమార్, లైబ్రరీ కార్యదర్శి పదవికి నారిన శ్రీనివాసరావు, బళ్ల శ్రీహరి, కొప్పినీడి చిట్టిపద్మజ, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల పదవికి సోడదాసి శ్రీధర్, కొప్పినీడి చిట్టి పద్మజ, మహిళా ప్రతినిధి స్థానానికి కుంచే దుర్గా భవాని నామినేషన్ పత్రాలు దాఖలు చేశారన్నారు. అలాగే కార్యవర్గ సభ్యుల స్థానాలకు చదలవాడ జ్ఞానప్రకాష్, ఓసూరి జ్యోతిమాంగళ్య, రంపా పుల్లాజీ, దొంగ నరసింహరాజు, కురెళ్ల అన్నపూర్ణ, కోపల్లె ఎల్ఎస్ఎస్.నాగశిరీష, చల్లా జ్యోతి, ధనాల చాముండేశ్వరి, పులపర్తి హర్షవర్ధన్, సిహెచ్‌వి.రామచంద్రమూర్తి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారని తెలిపారు.

డెంగీ నివారణకు కృషి చేయాలి

ప్రజాశక్తి - ఉండి

డెంగీ నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఉండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు బి.సాయిచంద్ర అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా డాక్టర్ బి.సాయిచంద్ర ఆధ్వర్యంలో మండలంలోని సచివాలయాలలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ బి.సాయిచంద్ర మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ ఇళ్ల వద్ద మురికి నీటిని నిల్వ ఉంచకూడదన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అధిక జ్వరం, కండరాలు, కీళ్ల నొప్పులు, చర్మం దద్దుర్లు వంటివి డెంగీ వ్యాధి లక్షణాలని, అవి విపరీతంగా ఉంటే వెంటనే దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొల్లు : పట్టణ పిహెచ్‌సి వీవర్స్ కాలనీ, బంగారు వారి చెరువుగట్టు కింద జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ ప్రసాద్ పాల్గొని మాట్లాడారు. పట్టణాన్ని డెంగీ రహిత మున్సిపాలిటీగా మార్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించారు. డాక్టర్ జాన్‌లియో, డాక్టర్ చంద్రశేఖర్, సబ్ యూనిట్ ఆఫీసర్ రాజ్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా వర్కర్లు, సూపర్ వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు. అగ్నిమాపక కేంద్రం సమీపంలోని అంబేద్కర్ సర్కిల్‌లో ఆరోగ్య సిబ్బంది మానవహారంగా ఏర్పడ్డారు.

తాడేపల్లిగూడెం : డెంగీ వ్యాధి నిర్ధారణకు ఆరోగ్య పరీక్షలే కీలకమని తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.లక్ష్మణరావు చెప్పారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో అవగాహనా కార్యక్రమలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే అనేక రకాల వ్యాధులను దూరం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు డాక్టర్ కె.అశాలత, డాక్టర్ చైతన్య, డాక్టర్ ఎస్.అమృత, డాక్టర్ శ్రావ్య ఆధ్వర్యంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు, ఆశాలు, మెప్మా సభ్యులు పాల్గొన్నారు.

ఆచంట : దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వేణుబాబు అన్నారు. మండలంలోని వల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వేణుబాబు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేను విధిగా నిర్వహించాలన్నారు. డెంగీ అని అనుమానం వచ్చిన వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ దోమలు కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఇఒ శివకుమార్, సిహెచ్ఒ, వీరమ్మ హెచ్‌వి వసంతకుమారి, ఎంపిహెచ్ఎస్.మోహన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాలకొల్లు రూరల్ : లంకలకోడేరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు అడ్డాల ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌కుమార్ మాట్లాడుతూ దోమకాటు ద్వారా వచ్చే వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవ్యజీవన్, డాక్టర్ భవానీప్రసాద్, ఆరోగ్య విస్తరణ అధికారులు గుడాల హరిబాబు, కె.ప్రభాకర్, పిహెచ్ఎన్ పి.ఎలిజిబెత్, సూపర్‌వైజర్లు ఎస్‌కె.అమలేశ్వర రావు, వై.నారాయణమూర్తి, జి.ఉదయ్‌చందర్, హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకివీడు : ఎవరికి వారు పరిశుభ్రత పాటించి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి.మహేశ్వరరావు సూచించారు. స్థానిక పిహెచ్‌సిలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దోమల కాటుకు గురి కాకుండా ప్రతిఒక్కఉ జాగ్రత్తలు వహించాలన్నారు. అనంతరం డెంగీ నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి మెహర్ ఉనిసా బేగం, సామాజిక ఆరోగ్య శాఖ అధికారి ప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కాళ్ల : ప్రతిఒక్కరూ డెంగీపై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ గులాబ్ రాజ్ కుమార్ అన్నారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ డెంగీ చాలా ప్రాణాంతకమైన వ్యాధి అని ప్రతిఒక్కరూ గుర్తించాలని ఆయన సూచించారు. అందరూ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ దేవరవి విజయవతి, పిహెచ్ఎన్.చండీరాణి, సూపర్‌వైజర్ పరమ జ్యోతి పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 45 మంది ఎంపిక

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక బిఆర్ఆర్ అండ్ జికెఆర్ ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో దివిస్ లాబొరేటరీస్ వారిచే బిఎస్‌సి, ఎంఎస్‌సి విద్యార్థులకు కళాశాలలో ప్రాంగణ ఎంపికలు మంగళవారం నిర్వహించారు. 63 మంది హాజరు కాగా 45 మంది ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ దిరిశాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఎంపికైన వారిలో 16 మంది ఛాంబర్స్ కళాశాల విద్యార్థులేనని, వీరికి నెలకు రూ.24 వేలు జీతం ఉంటుందని చెప్పారు. పిఎఫ్, గ్రాడ్యువిటీ, ఈఎస్ఐ, వైద్య సదుపాయం, వార్షిక బోనస్ తదుపరి సౌకర్యాలు ఉంటాయని, దివిస్ లాబరేటరీస్ హెచ్ఆర్ మేనేజర్లు సిహెచ్.పూర్ణప్రసాద్, ఎ.రాజేష్ తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు కళాశాల ఛైర్మన్ కెవిఆర్.నరసింహారావు, కళాశాల కార్యదర్శి కలిదిండి రామరాజు, ప్లేస్మెంట్ ఆఫీసర్ కె.లక్ష్మణరావు అధ్యాపకులు అభినందనలు తెలిపారు. ఛాంబర్స్ కళాశాల విద్యార్థులకు, ప్రాంగణ ఎంపికలకు వేదికగా నిలుస్తోందన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - ఆకివీడు

ఐసిడిఎస్ ఆకివీడు ప్రాజెక్టులో ఖాళీగా ఉన్న నాలుగు అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రాజెక్ట్ అధికారి వి.వాణి విజయరత్నం తెలిపారు. తమ ప్రాజెక్టు పరిధిలో నాలుగు స్థానాలు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆకివీడు ఒకటో కేంద్రంలో, ఉండి, కోరుకొల్లు, పెన్నాడ కేంద్రాల్లో ఒక్కోటి చొప్పున అంగన్‌వాడీ ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆయా స్థానాలకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఒక్క పెన్నాడలో మాత్రం ఎస్‌సిలకు కేటాయించినట్లు తెలిపారు. మిగిలిన మూడు స్థానాలు ఎవరైనా అర్హులేనని తెలిపారు. ఉద్యోగానికి స్థానిక మహిళలై ఉండాలని, జులై 1వ తేదీ నాటికి 21 సంవత్సరాలు వయసు నుండి 35 సంవత్సరాలు లోపుగా ఉండాలన్నారు. పదో తరగతి పాస్ అయి ఉండాన్నారు. దరఖాస్తులను ఈ నెల 23వ తేదీలోగా తమ ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

విద్యార్థులు కనీస జాగ్రత్తలు పాటించాలి : జెవి కృష్ణమూర్తి

ప్రజాశక్తి - ఉండి

వేసవి తాపం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో విద్యార్థులు కనీస జాగ్రత్తలు తీసుకోవాలని ఉండి శాఖా గ్రంథాలయం అధికారి జెవి.కృష్ణమూర్తి తెలిపారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం గ్రంథాలయంలో విద్యార్థులకు విశ్వజ్యోతి యోగాపై శిక్షణ ఇచ్చారు. అనంతరం కృష్ణమూర్తి మాట్లాడుతూ వేసవి తాపం రోజురోజుకూ పెరుగుతుండడంతో గ్రంథాలయానికి వచ్చే విద్యార్థులు టోపీ ధరించడం, తలకు రుమాలు కట్టుకోవడం వంటివి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ఎక్కువగా నీరు తాగాలన్నారు.

ఎపిఇఎపిసెట్ ప్రశాంతం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎపిఇఎపి సెట్ రెండో రోజు రెండో రోజు మంగళవారం కూడా ప్రశాంతంగా జరగింది. ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఉదయం ఏడుగురు, మధ్యాహ్నం ఐదుగురు గైర్హాజరయ్యారని పరీక్ష సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.గోపాలకృష్ణమూర్తి తెలిపారు. ఎండ తీవ్రత దృష్ట్యా విద్యార్థులను వెనువెంటనే పరీక్షా కేంద్రంలోకి పంపినట్లు ఆయన తెలిపారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని పొలమూరు గ్రామంలో డివైఎఫ్ఐ, ఐద్వా సహకారంతో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం సోమవారం రాత్రి ముగిసింది. బాలోత్సవలు, సొంత కథలు, పాటల పోటీలు, మ్యూజికల్ ఛైర్స్, పద్యాలు చెప్పడం, తెలుగులో మాట్లాడడం, డ్యాన్స్ పోటీలు, స్కిప్పింగ్ వంటి వినోద కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు కేత పద్మజ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.వాసు, డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుష్, సహాయ కార్యదర్శి చింతపల్లి మావో, జిల్లా కమిటీ సభ్యులు ప్రమోద్, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయ్ పాల్గొన్నారు.

'అగ్నికుల క్షత్రియులను మోసగిస్తున్న వైసిపి'

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

అగ్నికుల క్షత్రియులను సిఎం జగన్ మోసం చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని అగ్నికుల క్షత్రియ సాధికార రాష్ట్ర కన్వీనర్, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్, ప్రముఖ బిసి నాయకుడు కొప్పాడి రవీంద్రనాథ్‌ఠాగూర్ అన్నారు. కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అగ్నికుల క్షత్రియులకు వైద్యం, విద్య, ఉద్యోగ భద్రత విషయంలో చంద్రబాబు నాయుడు ఎంతో చేశారన్నారు. వైసిపి ప్రభుత్వం బిసిలను మోసం చేస్తుందన్నారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి కొల్లు పెద్దిరాజు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ పొన్నాల నాగబాబు, మాజీ ఎపిపి న్యాయవాది వైదని నాగేశ్వరరావు, పట్టణ యువత అధ్యక్షుడు బర్రె మురళి, మాజీ కౌన్సిలర్ శశిదేవి మల్లాడి మూర్తి, మాజీ కౌన్సిలర్ శశి, నాట్ల నరేష్, కొప్పాడి రాజు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లులో ఉన్న దేశాలమ్మ జాతర మహోత్సవాలు, ఊరేగింపు మంగళవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. గరగల నాట్య ప్రదర్శన, సన్నాయి మేళం, భేతాళ వేషాలు, కోయ డాన్స్, బుట్ట బొమ్మలు, కోర గేదెలు ప్రదర్శన, కేరళ తంబోళా, కాంతారా డప్పులు భేరీల గారడీ కార్యక్రమాలతో పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. యువత స్టెప్స్ పలువురిని ఆకర్షించాయి. పట్టణ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.